# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 24-09-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- సేవ అనేది అత్యంత శక్తివంతమైన చోదక శక్తిగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభివర్ణించారు.
- భారతదేశ నాగరిక వారసత్వాన్ని యువత అర్థం చేసుకోవాలని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ పేర్కొన్నారు.
- ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో సంస్కరణలు చేపట్టాలని జీ-4 దేశాల విదేశాంగ మంత్రులు కోరారు.
- దిగుమతి చేసుకునే ముడి సరుకు వంట నూనెలపై బేసిక్ కస్టమ్స్ డ్యూటీని కేంద్ర ప్రభుత్వం తగ్గించింది.

====================

సేవ అనేది అత్యంత శక్తివంతమైన చోదక శక్తిగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభివర్ణించారు. వాద్ నగర్ నుండి వారణాసికి ప్రయాణిస్తున్న సేవా యాత్రికులతో ప్రధానమంత్రి ఢిల్లీ నుండి దృశ్య మాధ్యమం ద్వారా ఈరోజు సంభాషించారు. సేవ అనేది జీవితానికి ప్రధాన ఉద్దేశ్యం కావాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. సేవా భావం ప్రతి వ్యక్తిలోనూ అంతర్లీనంగా ఉండాలని కోరారు. అత్యున్నత పదవిని అధిరోహించినప్పుడు కూడా రాజకీయాల్లో సేవే మార్గదర్శక సూత్రంగా ఉండాలని పేర్కొన్నారు. `పీఎం-కిసాన్` లేదా `పీఎం సూర్య ఘర్ యోజన` వంటి అనేక పథకాలు లబ్ధిదారులకు నేరుగా ప్రయోజనాలను చేరవేయడంలో గుర్తింపు పొందాయన్నారు. సేవా భావం ఉన్నప్పుడే 4 కోట్ల మంది పేదలకు శాశ్వత గృహాలు లభించాయని నరేంద్ర మోదీ వెల్లడిస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

====================

భారతదేశ నాగరిక వారసత్వాన్ని యువత అర్థం చేసుకోవాలని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ పేర్కొన్నారు. న్యూఢిల్లీలో 'విశ్వసంచార్ హిందుత్వ కా' అనే పుస్తకాన్ని ఆయన ఈరోజు విడుదల చేసిన అనంతరం మాట్లాడుతూ... హిందుత్వ ఎవరికీ వ్యతిరేకం కాదని అన్నారు. అందరినీ కలుపుకొని వెళ్తుందని చెప్పారు. 1925లో నాగ్‌పూర్‌లో డాక్టర్ కేశవ్ బలిరామ్ హెడ్గేవార్ స్థాపించిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శత వార్షికోత్సవాన్ని పూర్తి చేసుకున్న తరుణంలో ఈ పుస్తక ప్రచురణ చాలా సముచితమైనదని ఉపరాష్ట్రపతి అన్నారు. ఆర్ఎస్ఎస్ ఒక చిన్న సంస్థ నుండి ప్రపంచవ్యాప్త సంస్థగా ఎదిగిందని ఉపరాష్ట్రపతి గుర్తు చేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి (యూఎన్ఎస్‌సీ)లో సంస్కరణలు చేపట్టాలని జీ-4 దేశాల విదేశాంగ మంత్రులు కోరారు. న్యూయార్క్‌లో జరుగుతున్న ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం 81వ సదస్సు సందర్భంగా భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్, బ్రెజిల్ విదేశాంగ మంత్రి మౌరో వీరా, జర్మనీ విదేశాంగ మంత్రి జోహన్ డేవిడ్ వాడేఫుల్, జపాన్ విదేశాంగ మంత్రి మొటెగి తోషిమిత్సు ఈ మేరకు పిలుపు ఇచ్చారు. శాశ్వత, తాత్కాలిక విభాగాలలో మండలిని విస్తరించడమే ఈ సంస్కరణలకు కీలకం అని పేర్కొన్నారు. రోజు రోజుకూ సవాలుగా మారుతున్న భౌగోళిక రాజకీయ వాతావరణం దృష్ట్యా.. యూఎన్ఎస్‌సీ సంస్కరణలు గతంలో కంటే ఇప్పుడు మరింత అవసరమని జీ-4 దేశాల విదేశాంగ మంత్రులు అన్నారు. ఆఫ్రికా, ఆసియా-పసిఫిక్, లాటిన్ అమెరికా, కరేబియన్‌తో సహా తక్కువ ప్రాతినిధ్యం ఉన్న, ప్రాతినిధ్యం లేని ప్రాంతాలు, సమూహాలకు మరింత ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరాన్ని కూడా వారు గుర్తు చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ వంట నూనెల ధరలను నియంత్రించే లక్ష్యంతో దిగుమతి చేసుకునే ముడి సరుకు వంట నూనెలపై బేసిక్ కస్టమ్స్ డ్యూటీని కేంద్ర ప్రభుత్వం తగ్గించింది. ఈ నిర్ణయం వల్ల వినియోగదారులకు ఉపశమనం కలిగించడంతో పాటు అంతర్జాతీయ వంట నూనెల ధరలలో వచ్చిన భారీ పెరుగుదల వల్ల తలెత్తే ద్రవ్యోల్బణ ఒత్తిళ్లను కూడా తగ్గిస్తుందని కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. దిగుమతి సుంకం తగ్గింపు వల్ల కలిగే పూర్తి ప్రయోజనం వినియోగదారులకు చేరేలా చూడాలని సంబంధిత పరిశ్రమల భాగస్వాములకు కేంద్ర ప్రభుత్వం సూచించింది.

= = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ మొబైల్ ఫోన్ల డిమాండ్‌లో 99.2 శాతాన్ని భారతదేశం తీరుస్తోందని కేంద్ర ఎలక్ట్రానిక్స్ శాఖ కార్యదర్శి ఎస్. కృష్ణన్ అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన 13వ `వార్షిక పబ్లిక్ అఫైర్స్ ఫోరమ్ ఆఫ్ ఇండియా -2026` ప్రారంభోపన్యాసంలో ఆయన మాట్లాడుతూ... భారత్ ఏటా సుమారు 32 నుండి 33 కోట్ల మొబైల్ ఫోన్లను తయారు చేస్తోందని చెప్పారు. ఐదు ప్రధాన అంతర్జాతీయ మొబైల్ ఫోన్ బ్రాండ్లు భారతదేశంలోనే తమ పరికరాలను తయారు చేస్తున్నాయని గుర్తు చేశారు. ప్రపంచ స్థాయిలో పోటీతత్వాన్ని పెంపొందించడానికి కేంద్ర ప్రభుత్వం మొబైల్ ఫోన్ తయారీ పథకాన్ని ప్రారంభించిందని కృష్ణన్ వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తర ప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాలో బస్సులో సంభవించిన అగ్ని ప్రమాదం ఘటనపైన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విచారం వ్యక్తం చేశారు. గ్రేటర్ నోయిడాలోని యమునా ఎక్స్‌ప్రెస్‌వేపై ప్రయాణిస్తున్న స్లీపర్ బస్సులో మంటలు చెలరేగడంతో కనీసం తొమ్మిది మంది ప్రయాణికులు సజీవ దహనమయ్యారు. పోలీసుల సమాచారం ప్రకారం.. ఈ ఘటన జేవార్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దయానత్‌పూర్ గ్రామం సమీపంలో అర్ధరాత్రి సమయంలో జరిగింది. ఇదిలా ఉండగా ఈ ఘటనలో మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుండి 2 లక్షల

రూపాయలు, గాయపడిన వారికి 50 వేల రూపాయల చొప్పున పరిహారాన్ని ప్రధానమంత్రి ప్రకటించారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 138వ సంచిక ఈనెల 27వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు రేపు సాయంత్రం వరకు పంపించవచ్చు.

= = = = = = = = = = = = = = = = = = = =

గణేశ ఉత్సవాల ముగింపు సందర్భంగా రేపు జరగనున్న గణేశ విగ్రహ నిమజ్జన ఊరేగింపు కోసం పూణే పోలీసులు విస్తృత ఏర్పాట్లు చేశారు. ప్రధాన ఊరేగింపు మార్గాల ద్వారా మొత్తం 638 గణేశ మండపాలు పాల్గొంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు. భద్రతాపరమైన నిర్వహణ కోసం 10 వేల మందికి పైగా పోలీసు సిబ్బంది, హోం గార్డులు, ఇతర భద్రతా సిబ్బందిని నియమించారు. దాదాపు 3 వేల 500 సీసీటీవీ కెమెరాలతో పాటు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత వీడియోలు, డ్రోన్‌ల ద్వారా నిమజ్జన కార్యక్రమాలను పర్యవేక్షిస్తారని అధికార వర్గాలు తెలిపాయి.

= = = = = = = = = = = = = = = = = = = =

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం నిన్న అర్ధరాత్రి ఆంధ్రప్రదేశ్ లోని శ్రీకాకుళం జిల్లా కళింగపట్నం సమీపంలో తీరాన్ని దాటింది. దీని ప్రభావంతో ఒడిశాలోని పలు ప్రాంతాలతో పాటు, ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇదిలా ఉండగా పశ్చిమ బెంగాల్, తెలంగాణ, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ ఇతర రాష్ట్రాలలో ఈరోజు భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంటూ భారత వాతావరణ విభాగం (ఐఎండి) రెడ్ అలర్ట్ జారీ చేసింది. అదే విధంగా బీహార్, జార్ఖండ్, విదర్భ, పశ్చిమ బెంగాల్, సిక్కింలో కూడా భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. ఆ వివరాలను ఐఎండీ శాస్త్రవేత్త వెల్లడిస్తూ...

(వాయిస్ 24 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

ఏసియన్ గేమ్స్ 2026 అథ్లెటిక్స్ విభాగంలో భారత్ క్రీడాకారులు పతకాలు సాధిస్తూ.. తమ ప్రతిభను చాటుకుంటున్నారు. తాజాగా 4x400 రిలేలో భారత్‌కు రజతం దక్కింది. అలాగే 10 వేల మీటర్ల పరుగు పందెంలో కాంస్యం వరించింది. దీంతో భారత్ పతకాల సంఖ్య 17కి చేరుకుంది. ఇందులో ఒక స్వర్ణం, ఏడు రజతాలు, తొమ్మిది కాంస్యాలు ఉన్నాయి.  400 మీటర్ల మిక్స్‌డ్ రిలే విభాగంలో భారత్‌కు ఈ  రజతం దక్కింది. మను, పూవమ్మ, విశాల్, విద్యతో కూడిన భారత జట్టు 3:14.46 నిమిషాల్లో రేసును పూర్తి చేసింది. ఇదిలా ఉండగా 10 వేల మీటర్ల పరుగు పందెంలో కాంస్యం సాధించిన సీమాను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమం వేదికగా అభినందించారు. 'ఆసియా క్రీడల్లో 10 వేల మీటర్ల పరుగు పందెంలో కాంస్యం నెగ్గిన సీమాను చూసి భారత్ గర్విస్తోందని ఆయన అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = =

భారత నౌకాదళం ఫ్రెంచ్ నౌకాదళం మధ్య జరుగుతున్న 24వ ద్వైపాక్షిక సముద్ర విన్యాసం `వరుణ`లో పాల్గొనేందుకు ఐఎన్ఎస్ త్రిశూల్ ఫ్రాన్స్‌లోని టౌలాన్‌కు చేరుకుంది. ఈ విన్యాసంలో భాగంగా నౌకాశ్రయంలో సముద్రంలో క్రాస్-డెక్ సందర్శనలు, కార్యాచరణ పరస్పర చర్యలు, క్రీడాపరమైన కార్యక్రమాలతో సహా వృత్తిపరమైన కార్యక్రమాలు జరుగుతాయని రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ కార్యక్రమాలు ఇరు నౌకాదళాలకు అనుభవాలను, ఉత్తమ

పద్ధతులను పంచుకోవడానికి, పరస్పర సహకారాన్ని మెరుగుపరచుకోవడానికి, పరస్పర అవగాహనను పెంపొందించుకోవడానికి అవకాశాలను అందిస్తాయని మంత్రిత్వ శాఖ పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు భారీ నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 74 వేల 828 పాయింట్ల వద్ద ప్రారంభమై.. చివరికి 1248 పాయింట్ల నష్టంతో 73 వేల 580 వద్ద ముగిసింది. నిఫ్టీ 383 పాయింట్లు కోల్పోయి 23 వేల 063 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 95 రూపాయల 95 పైసలుగా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 105.23 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు ధర 4 వేల 252 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = =